క్లుప్తంగా

దివ్యాంగ పిల్లలకు విద్యపై ఆసక్తి పెంచాలి



భవితా కేంద్రానికి బీరువా అందిస్తున్న దాతలు

జే.పంగులూరు: దివ్యాంగ పిల్లలకు విద్యపై ఆసక్తి పెంచి వారిని విధిగా పాఠశాలకు రప్పించాలని జిల్లా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ ఎం జ్యోత్స్న అన్నారు. మండల పరిధిలోని పంగులూరు స్థానిక భవితా కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. సెంటర్‌లో ఫిజియోథెరపీ వైద్యులు చేస్తున్న చికిత్సను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫిజియోథెరపీ దివ్యాగులకు ఎంతో ఉపయోగం అన్నారు. ఫిజియోథెరపీ ఎం ప్రియదర్శిని తమ స్నేహితులు డాక్టర్ కర్నాటి అజయ్‌కృష్ణ (ఎండీ) తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భవితా సెంటర్‌కు రూ. 15 వేల విలువ గల ఏరోఫిట్ ఫిజియోథెరపీ సైకిల్‌ను బహూకరించారు. బాపనపల్లి నాగరాజు (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ యూకె) రూ. 10 వేల విలువ కలిగిన బీరువాను బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈవో వీరాంజనేయలు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి భాస్కరమూర్తి, ఐఈఆర్‌పిలు పి యోహాన్, టి అరుణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు అద్దంకిలో హనిమిరెడ్డి పర్యటన

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. దీనిలో భాగంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మండలంలోని తిమ్మాయపాలెం, 7 గంటలకు మైలవరం పంచాయతీ పరిధిలోని ఏలేశ్వరవారిపాలెం, రాత్రి 7.30 గంటలకు బల్లికురవ మండలంలోని కొమ్మినేని వారిపాలెం, వల్లాపల్లి గ్రామాల్లో ఓవివాహ వేడుకలకు హాజరవుతారని ప్రకటనలో పేర్కొన్నారు.


గ్రామసభల నిర్వహణకు నోడల్ అధికారులు

చినగంజాం: మండలంలోని 12 పంచాయతీల పరిధిలో శుక్రవారం నిర్వహించే గ్రామసభలకు నోడల్ అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ కే స్వరూపరాణి తెలిపారు. సంతరావూరు, గొనసపూడి గ్రామ పంచాయతీలకు పీఆర్ఏఈ దాసు, చింతగుంపల పంచాయతీకి ఎంఈఓ ఎస్ కోటేశ్వరరావు, కడవకుదురు పంచాయతీకి ఈఓపీఆర్డీ ఎస్ వేణుగోపాలకృష్ణ మూర్తి, మోటుపల్లికి ఏపీఓ జే లక్ష్మీదేవి, చిన గంజాం పంచాయతీకి ఎంపీడీవో కే స్వరూప రాణి, పల్లెపాలెం పంచాయతీకి హౌసింగ్ ఏఈ జీ రాజశేఖర్, కొత్తపాలెం పంచాయతీకి ఏవో కే భాస్కరరావు, రాజుబంగారు పాలెం, మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీలకు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, నీలాయపాలెం, పెదగంజాం పంచాయతీలకు వెలుగు ఏపీఎం కే అంజిబాబులను నియమించినట్లు ఆమె తెలిపారు. గ్రామ సభలకు ప్రజలంతా హాజరై ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులపై అర్జీలు సమర్పించాలని కోరారు.

నేడు సామూహిక రాజ్యలక్ష్మి వ్రతాలు

చినగంజాం: శ్రావణమాసం పురస్కరించుకొని స్థానిక భావన్నారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక రాజ్యలక్ష్మి అమ్మవారి వ్రతాలు నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు రిటైర్డ్ తెలుగు పండితుడు జీ పిచ్చయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం రాజ్యలక్ష్మి అమ్మవారికి విశేష పంచామృత స్నపన తిరుమంజనం కార్యక్రమం జరుగనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక రాజ్యలక్ష్మి వ్రతాలు జరుగుతాయని, కార్యక్రమంలో ముత్తైదువులు, కన్యలు పాల్గొనవచ్చునని తెలిపారు. వ్రతాల్లో పాల్గొనే మహిళలు పూజా ద్రవ్యాలను వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



తాటిపర్తి పేరిరెడ్డి (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి ఆచూకి లభించకుండా పోయిన ఘటన ఇంకొల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పావులూరు గ్రామానికి చెందిన తాటిపర్తి పేరిరెడ్డి మతిస్థిమితం లేక వయోభారంతో ఉన్నాడు. గత నెల 30వ తేదీ ఉదయం ఇంటి నుంచి సెంటర్‌కు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. అయితే అతడు చిలకలూరిపేట వైపు వెళ్లే బస్సులో ఎక్కి వెళ్లాడని స్థానికులు కొందరు అతని కుమార్తె తాడిపర్తి శ్రీదేవికి సమాచారం మందించారు. దాంతో అతని కోసం చుట్టుపక్కల బంధువుల వద్ద విచారించినా అతని ఆచూకీ దొరకలేదు. దాంతో కుమార్తె శ్రీదేవి గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒక్క టీకాతో గాలికుంటుకు చెక్

- గాలికుంటు వ్యాధికి ఉచితంగా టీకాలు
- పశువుల సంరక్షణపై పశువైద్యశాఖ ప్రత్యేక దృష్టి
- వేటపాలెం మండలంలో 9,500 పశువులకు టీకాలు



గేదెకు టీకా వేస్తున్న పశువైద్యాధికారిణి పుష్పలత

వేటపాలెం: నోరులేని మూగజీవాల పట్ల పశుపోషకులు జాగ్రత్తగా ఉండాలి. వాటిని నిత్యం మనుషుల వలే కనిపెట్టుకొని ఉంటూ పెంపకాన్ని సాగించాలి. అప్పుడే వాటి నుంచి మన తగినంత ఉత్పత్తి సాధించవచ్చు. పశువుల్లో అనేక వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో నివారణకు పశువైద్యశాఖ ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసింది. వైరస్ వల్ల వచ్చే తీవ్రమైన అంటువ్యాధి ఈ గాలికుంటు వ్యాధి. చీలిన గిట్టలున్న పశువుల్లో మాత్రమే ఈవ్యాధి కనిపిస్తుంది. గాలికుంటు వ్యాధి కలిగించే వైరస్‌లో ఓఏసీ, ఆసియా-1, సాట్-1, సాట్-2, సాట్-3 వంటి రకాలున్నాయి. గాలి కుంటు వ్యాధి బారిన పడిన పాడిపశువు పాలు తాగితే దూడలు మృత్యువాత పడతాయి. పశువులకు ఈవ్యాధి సోకకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈనెల 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గ్రామాల్లో ఉన్న ప్రతి పశువుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తోంది.

> **పశువులకు టీకాలు వేయించాలి..**
> పశువుల్లో గాలికుంటూ వ్యాధి నివరణకు పశుసంవర్ధక శాక జాతీయ పశువ్యాధి నివారణ పథకం కింద ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామాల్లో పాడి రైతులు తమ ఆవులు, ఎద్దులు, గేదెలకు తప్పకుండా గాలికుంటు టీకా వేయించాలి. ఈవ్యాధి సోకితే రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది. మండల పరిధిలో 9,500 పశువులకు సెప్టెంబర్ 18 వరకు ఉచితంగా టీకాలు వేస్తారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకాలు వేయించాలి. వ్యాధి రాకుండా ముందస్తుగా ఎంతో ఉపయోగపడుతుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
> – పుష్పలత, పశువైద్యాధికారి, వేటపాలెం

గాలికుంటు వ్యాధి లక్షణాలు..

వ్యాధి సోకిన ఆవులు, ఎద్దులు, గేదెల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. నీరసంగా మారి నడిచేందుకు ఇబ్బంది పడతాయి. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటిబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ వంటి మందులను వాడాల్సి ఉంటుంది.

వ్యాధి వ్యాప్తి ఇలా..

ఈ వ్యాధి కలిగంచే వైరస్ క్రిములు పశువుల పేడ, పారుడు, పొంగు, వీర్యము, పాలు, పుండ్ల ద్వారా విసర్జింపబడి వేరొక పశువుకు నీటి ద్వారా గాలి ద్వారా, మేత ద్వారా వ్యాప్తి చెందుతాయి.

నివారణ చర్యలు..

- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.
- 5 శాతం క్రెసాల్‌ను నీటిలో కలిపి పశువుల పాకను కడిగితే వైరస్ నశిస్తుంది.
- పక్క గ్రామాల్లో వ్యాధి ఉన్నప్పుడు పశువులను సంతలకు, జాతరలకు వెళ్లనివ్వరాదు.
- ఆరోగ్యంగా ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా మొదటిసారి 2 నెలల వయసులోనే వేయించాలి.
- బూస్టర్ డోసు నెల తరువాత వేయించాలి. ఆ తరువాత ప్రతి ఏటా క్రమం తప్పకుండా వేయించాలి.
- టీకా మందు మోతాదు 2 ఎంఎల్ ఇవ్వాలి.
- టీకా వేసిన తరువాత 1 నుంచి 3 వారాల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొంది పశువుల్లో వ్యాధి సోకకుండా ఉంటుంది.
- పాడి పశువులకు ఈనిన తరువాత టీకా వేయించాలి.
- వ్యాధి సోకిన ఆంబోతులు, దున్నలను సంపర్కానికి వినియోగించరాదు.
- పాలను బాగా వేడి చేసిన తరువాత తాగడానికి వినియోగించాలి.
- వ్యాధితో బాధపడుతున్న పశువుల పాలను తాగిన దూడలు చనిపోయే ప్రమాదం ఉంది.
- పశువుల కళేబరాన్ని లోతైన గొయ్యి తీసి అందులో సున్నం వేసి పాతి పెట్టాలి.. లేదా కాల్చివేయాలి.

మినుము పంటపై బెట్ట ప్రభావం



ముప్పవరంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



మినప రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

మార్టూరు: మినుము పంట సాగు చేసిన రైతులు వర్షాభావ పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మార్టూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో ఏవో కిరణ్ కుమార్‌తో కలిసి గురువారం మినప పంటలను పరిశీలించిన ఆయన స్థానిక రైతులకు ప్రత్యేక సూచనలు చేశారు. ప్రస్తుతం మినుప పంటలో బెట్ట తీవ్రత అధికంగా ఉన్నందున నీటి అవకాశం ఉన్న రైతులు తేలికపాటి తడిని ఒకసారి ఇవ్వాలన్నారు. నీటి లభ్యత అవకాశం లేని రైతులు ఒక కిలో మల్టీ కే (13045) లేదా 500 మిల్లీ లీటర్ల నానో యూరియాను ఎకరాకు పిచికారీ చేయాలని ఆయన తెలిపారు. పైరు వయసు 20 నుంచి 25 రోజుల దశలో ఉండగా ఉదర, చిప్పర, గరిక లాంటి గడ్డి జాతి కలుపు మొక్కల నివారణ కోసం ఎకరానికి 400 మిల్లీ లీటర్ల క్విజాలోఫోప్ ఇథైల్ పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీ కృష్ణమూర్తి, వీఏఏ చైతన్య స్థానిక రైతులు పాల్గొన్నారు.

జే.పంగులూరు: మండల పరిధిలోని ముప్పవరం రైతు సేవా కేంద్రంలో మార్టూరు వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీఏఏలకు సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. మినుములో బెట్ట పరిస్థితుల నుంచి పంటలను కాపాడుకోవడానికి లీటర్ నీటికి రెండు గ్రాముల చొప్పున యూరియా కలిపి రెండు రోజులు వ్యవధిలో పంటపై పిచికారీ చేయాలన్నారు. అనంతరం వ్యవసాయాధికారి డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు సాగుచేసిన అన్ని పంటలు తప్పనిసరిగా పంట నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సేవా కేంద్ర సిబ్బంది పాలొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో గ్రామసభలు

మార్టూరు: నేటి నుంచి మండలంలోని 16 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రెండు విడతలుగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి నితిన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు డేగరమూడి, రాజుపాలెం, బొబ్బేపల్లి, బొల్లాపల్లి, రాజుగారిపాలెం, ఇసుక దర్శి, ద్రోణాదుల, నాగరాజుపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారు. సాయంత్రం మూడు గంటలకు చిమ్మిరిబండ, కోలలపూడి, కోనంకి, మార్టూరు, లక్కవరం, తాటివారిపాలెం, వలపర్ల గ్రామాల్లో ఉంటుదన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులు, చేయాల్సిన పనుల గురించి గ్రామ సభల్లో ఆమోదం పొందుట గురించి సభలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు తప్పనిసరిగా గ్రామసభలకు హాజరు కావాలని ఎంపీడీవో ఒక ప్రకటనలో కోరారు.

ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామ సభలు

కారంచేడు: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపిక చేసిన నోడల్ ఆఫీసర్ల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధిపతుల సమక్షంలో శుక్రవారం గ్రామసభలు జరుగుతాయాన్నరు. ఉదయం 10 గంటల నుంచి కారంచేడులో తహసీల్దారు, స్వర్ణలో ఎంపీడీఓ, కుంకలమర్రులో ఈఓపీఆర్డీ, నాయుడువారిపాలెంలో ఎంఏఓ, కేశవరప్పాడులో డీటీ, కొడవలివారిపాలెంలో ఎంఈఓ-1, పోతినవారిపాలెంలో ఎంఈఓ-2, దగ్గుబాడులో పీఆర్ ఏఈ, ఆదిపూడిలో హౌసింగ్ ఏఈ, జరుబులవారిపాలెంలో ఏపీఎం, తిమిడెదపాడులో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, యర్రంవారిపాలెంలో ఏఈ ఎలక్ట్రికల్, స్వర్ణపాలెం, రంగప్పనాయుడువారిపాలెంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు హాజరవుతారన్నారు. వీరు పనులు గుర్తింపుతో పాటు, లేబర్, బడ్జెట్ తయారీ, గ్రామసభల నిర్వహణ వంటి విషయాలపై చర్చిస్తారని ఆయన తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న సభ్యులు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల, సినీనటుడు, పద్మవిభూషణ్ చిరంజీవి యువత సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక రోటరీ క్లబ్‌లో చిరంజీవి పుట్టిన రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైట్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని రొటేరియన్ బండారుపల్లి హేమంత్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో 21 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో చందలూరి వెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, వలివేటి మురళీకృష్ణ, జివై ప్రసాద్, ఎస్‌వి స్వామి, శేఖర్, హాస్పిటల్ సిబ్బంది, అభిమానులు పాల్గొన్నారు.

చీరాల టూటౌన్ సీఐగా నాగభూషణం

చీరాల: చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.నాగభూషణం నియమితులయ్యారు. ఈ మేరకు గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు రేంజి వీఆర్‌లో ఉన్న ఆయన టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు సీఐగా విధులు నిర్వర్తించిన సోమశేఖర్ కొండపికి బదిలీ అయ్యారు.

జూదరుల అరెస్టు

చినగంజాం: మండలంలోని పల్లెపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్ రమేష్ తెలిపారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.700 నగదు స్వాధీనం చేసుకున్నామని, అరెస్టు చేసిన వారిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

సరైన జాగ్రత్తలతో ఎయిడ్స్ దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎయిడ్స్ నియంత్రణ మండలి, ప్రతినిధులు

మేదరమెట్ల: సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఎయిడ్స్ మహమ్మారిని పారదోలవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అపోహలు, అనుమానాల ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా కొరిశపాడు మండలంలోని రావినూతల జెడ్పీహెచ్ఎస్‌లో పిల్లలకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన మండలి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా పాల్గొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. వ్యాధి సోకిన వ్యక్తులతో కలసి జీవిస్తే, కలసి తిరిగితే వ్యాధి సోకదన్నారు. లైగింక సంబంధాలను పెట్టుకోవడం, రక్తం మార్పిడి చేసుకోవడం వల్ల మాత్రమే వ్యాధి ఇతరులకు సోకుతుందని వివరించారు. కార్యక్రమంలో బీవీ సాగర్, కృష్ణవేణి, రాధ, సువార్త, రవీంద్ర, అంజలీకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శ్రావణ మాసం, రేవతి నక్షత్రం, చవితి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయాన్ని మూసివేస్తారు.

వైరల్ జ్వరాలపై అప్రమత్తత అవసరం



జీ సురేష్‌బాబు, పీహెచ్‌సీ, కారంచేడు

కారంచేడు: వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాపించే వైరల్ జ్వరాలను తరిమికొట్టేలా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కారంచేడు పీహెచ్‌సీ డాక్టర్ జీ సురేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కలెక్టర్, డీఎంహెచ్ఓ వంటి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ఫీవర్ సర్వేలను పటిష్టపరిచామన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రతి ఇంటినీ జల్లెడపడుతున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితులను రికార్డు చేస్తున్నారన్నారు. ఈ సీజన్‌లో ఎక్కువగా విషజ్వరాలు, వైరల్ ఫీవర్లు, డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ప్రజలు వీటి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్తా, చెదారాలు నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, వాడని పూల కుండీలు, వాడని నీటి తొట్లు వంటివి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు మరీ ముఖ్యంగా మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరాలు వచ్చిన తరువాత ఇబ్బంది పడే కంటే, జ్వరాలు వ్యాప్తికి దోహదపడే దోమలు, లార్వాలను తొలగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను అలవర్చుకోవాలన్నారు. ఇంటి వద్ద దోమ తెరలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

కూలేందుకు సిద్ధంగా టెలిఫోన్ స్తంభం



కూలేందుకు సిద్ధంగా ఉన్న టెలిఫోన్ స్తంభం

కారంచేడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వాలిపోయిన టెలిఫోన్ స్తంభం ఎప్పుడు కూలిపోతుందో తెలియక గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం కారంచేడులో పెద బజారు సెంటర్-చిన వంతెన సెంటర్‌ల మధ్యన టెలిఫోన్ స్తంభం దర్శనమిస్తుంది. నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో స్తంభం వాలిపోయి ఉండటంతో అటుగా వెళ్తున్న వారు భయాందోళనకు గురవుతున్నారు. సమీప గృహాలకు చెందిన ప్రజలు సైతం వాలిపోయిన ఈ టెలిఫోన్ స్తంభం స్థానంలో కొత్తది వేయాలని వారు కోరుతున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



స్టేషన్ వద్ద ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

వేటపాలెం: రాత్రి వేళల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణ చేస్తున్నారు దుండగులు. మండలంలోని అక్కాయిపాలెం పంచాయతీ శివారు నుంచి రాత్రి వేళల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. రాత్రి పెట్రోలింగ్ సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు వాటిని పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించామని చెప్పారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

చీరాల: పట్టణంలోని వైకుంఠపురం 22వ వార్డులో ప్రధాన మురుగు కాలువలో ఉన్న సిల్టు కారణంగా మురుగునీటి పారుదల లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో గురువారం మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి పరిశీలించారు. అలానే కాలువలో విద్యుత్ స్తంభం అడ్డుగా ఉందన్నారు. దీని వలన సిల్టు తీసేందుకు ఇబ్బందిగా ఉండడంతో పాటు విద్యుత్ సరఫరా అవుతోవదన్నారు. సిల్టు వలన మురుగునీరు నిలిచి అంటు వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉందని శానిటేషన్ సిబ్బంది తెలిపారన్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏడీఈ టి.శ్రీనివాసరావు సంప్రదించగా గురువారం విద్యుత్ స్తంభాన్ని మార్పు చేశారన్నారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్

చీరాల అర్బన్: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించిన ప్రభుత్వాలను ప్రజలు విస్మరిస్తారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య అన్నారు. గురువారం స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా విస్తృతస్థాయి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎస్.కరిముల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేసేలా ఉండాలని, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ కార్మిక వర్గ వ్యతిరేక విధానాల వలన దేశంలో తన ఉనికిని కోల్పోయే పరిస్థితి వచ్చిందని, ఇండియా కూటమి పుంజుకుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. నూతన ప్రభుత్వం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ కోటి రూపాయలు సంక్షేమ నిధికి విరాళం ఇస్తానని హామీ ఇచ్చారని, సత్వరమే ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ అధికారం చేపట్టిన టీడీపీ ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్నభోజన పథకం, ప్రభుత్వ పాఠశాల్లో ఆయాలుగా పనిచేసే అతి క్రింది స్థాయి కార్మికులను కక్ష సాధింపు ధోరణిలో బలవంతంగా ఉద్యోగాలు నుంచి తొలగించడం చేస్తుందన్నారు. ప్రభుత్వం చిరుద్యోగులకు జీతాలు సమయానికి అందించాలని, వారి ఉద్యోగాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు మేడా వెంకట్రావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాసు, బీసీ ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ జిల్లా కన్వీనర్ ఎస్.వాణిశ్రీ, చీరాల నియోజకవర్గ భవన నిర్మాణరంగ కార్యదర్శి సిహెచ్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి



మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన పేర్లి నాని, శీలం చంటి

చీరాల రూరల్: ప్రజా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన అధికారంలో లేని లోటు నేడు రాష్ట్ర ప్రజలకు కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పేర్లి నాని, శీలం చంటిలు అన్నారు. గురువారం వారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. జనరంజకంగా పాలన అందించిన జగన్ మోహన్‌రెడ్డి తమ అభిమాన నాయకుడు అని, ఆయనను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.